క్లుప్తంగా

పేదరిక నిర్మూలనకు మహా పాదయాత్ర


వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్

సిర్పూర్(టి): పేదరిక నిర్మూలనలకు ఈనెల 25 నుంచి ఏప్రిల్ 25 వరకు మండల కేంద్రం నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల మీదుగా హైదరాబాద్ వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేదరిక నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఎస్సై దీకొండ రమేశ్‌కు మహాపాదయాత్ర కరపత్రాలతో పాటు వినతిపత్రం అందజేశారు. పేదరిక నిర్మూలనకు సీఎంకు సైతం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

కళాకారుడు అనిల్‌కు ప్రశంసా పత్రం


అనిల్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న సభ్యులు

కౌటాల: మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు సినీ టీవీ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన కళాకారుడు అనిల్ కోసన్‌కార్‌ను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు వి.ఎన్ ఆదిత్య, సీరియల్ దర్శకుడు నాగబాల సురేష్‌కుమార్‌లు అనిల్‌కు ప్రశంసా పత్రం, మెమెంటో అందించారు. గ్రామీణ కళాకారులు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు.

26న ఎస్పీఎం కార్మికుల సమస్యలపై సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం కార్మికుల సమస్యలపై ఈనెల 26న ఉదయం 11 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎస్పీఎం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గోలెం వెంకటేశం తెలిపారు. ఎస్పీఎం గేటు ముందు ప్రజా కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశానికి ఎస్పీఎం స్టాఫ్ ఉద్యోగులు, పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు హాజరు కావాలని కోరారు.

శైలానిబాబా దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండా గ్రామంలో ఉన్న శైలానిబాబా దర్గాను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం సందర్శించారు. చాదర్ సమర్పించి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అదే గ్రామానికి చెందిన జాదవ్ హేమంత్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన విషయాన్ని తెలుసుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్ సునీత నారాయణ్ జాదవ్, ఎంపీటీసీ కళావతి ఉత్తం బాదావత్, హాజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్ లాల ఉన్నారు.

నేడు మండల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం 22వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(బీపీడీపీ) 2024–25, సబ్‌కీ యోజన– సబ్‌కీ వికాస్(ఎస్‌వైఎస్‌వీ) ప్రణాళిక తయారీ కోసం మండల పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి గౌరవ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

నెన్నెల: వినియోగదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని బెల్లంపల్లి విద్యుత్ ఏడీఈ రాంచందర్ అన్నారు. నెన్నెల, ఆవుడం మెయిన్ విద్యుత్ లైన్‌లకు తగులుతున్న చెట్ల కొమ్మల కత్తిరింపు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అందుబాటులో ఉంటూ 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఈ చిన్న ప్రమాదం సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పెండింగ్ లేకుండా నెలనెలా వంద శాతం బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లను నిరంతరం పర్యవేక్షించాలని విద్యుత్ ఏఈ మల్లయ్యకు సూచించారు. ఆయన వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్‌మెన్ లచ్చన్న, సిబ్బంది ఉన్నారు.

హరిత సంకల్పానికి సిద్ధం

- నర్సరీల్లో కొనసాగుతున్న పనులు
- 2లక్షల మొక్కలు పెంచడమే టార్గెట్
- పర్యవేక్షిస్తున్న అధికారులు


చేడ్వాయిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలో నిర్వహించనున్న 9వ విడత హరితహారంలో భాగంగా 2లక్షల మొక్కలను నాటేందుకు అధికారులు నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో ఉపాధిహామి పథకంలో భాగంగా 12 నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు పనులను పూర్తి చేస్తున్నారు.

సిద్ధమైన నర్సరీలు..

మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇప్పటికే మొక్కలను పెంచటానికి బ్యాగుల్లో మట్టి నింపారు. నర్సరీల్లో కలుపు మొక్కలను నివారించటానికి కవర్లను కప్పి ఉంచారు. మరోవైపు పనులు పూర్తయిన నర్సరీలకు మొక్కలను పెంచేందుకు ఇప్పటికే విత్తనాలను సైతం పంపిణీ చేశారు.

రకరకాల మొక్కలు..

గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపుల, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలను నాటడానికి అనువైన మొక్కలను పెంచుతున్నారు. టేకు, వేప, చింత, వెదురు, మునగ, మామిడి, జామ, మందార, గులాబీతో పాటు అనేక రకాల పండ్ల మొక్కలను పెంచనున్నారు. నర్సరీల్లో వన సేవకులను ఏర్పాటు చేసిన అధికారులు నిత్యం నర్సరీలను సందర్శిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మొక్కల పెంపకంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయటానికి కార్యాచరణ రూపొందించారు.

వేగంగా పనులు

మండలంలో 12 నర్సరీల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. 2లక్షల మొక్కలను నాటడానికి లక్ష్యం నిర్దేశించుకున్నాం. నర్సరీల్లో బ్యాగుల్లో ఇప్పటికే మట్టిని నింపడం పూర్తయ్యింది. ప్రతీ వారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నాం. - గంగాసింగ్, ఎంపీడీవో

భయపెడుతున్న మేఘం!

- వారం రోజులుగా ఇదే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


పొలంలో పగిలి ఉన్న పత్తి

కెరమెరి: సుమారు వారం రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై, మంచుదుప్పటి కప్పి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 6400 మంది రైతులు ఉన్నారు. సుమారు 22వేల ఎకరాల్లో పత్తి, 500 ఎకరాల్లో జొన్న పంటలు సాగు చేస్తున్నారు. పగలంతా మేఘావృతమై ఉండడంతో పత్తి, జొన్న, వేరుశనగ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పొలాల్లో పత్తి పగిలి తీయడానికి కూలీలు లభించడం లేదు. ఈ నేపథ్యంలో వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోతామని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల్లో గుబులు

ఓ వైపు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రకృతి అన్నదాతను మరింత భయపెడుతోంది. పత్తి తీతకు కూలీలు లభించక రైతుల పొలాల్లోనే పత్తి పంట మూలుగుతుంది. ఈసమయంలో వర్షం పడితే ఎలా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆకాశంలో మబ్బులు ఉండడంతో జొన్న పంటకు పేను బంక అధికంగా వ్యాపించే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు పత్తి, జొన్న పంటలకు చేటు చేసే ప్రమాదం ఉంది.

బీమాపై ప్రచారం అంతంతే..

పంటలు ఏదో ఒక రకంగా నష్టపోతే బీమా కింద నష్టపరిహారం వచ్చే అవకాశం ఉన్నా అనేక మంది రైతులకు బీమాపై అవగాహన లేదు. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు. అవగాహన కల్పిస్తున్నా ఇప్పటికీ 40శాతం పంటలకు కూడా బీమా చేసుకోలేదని అధికారులు చెబుతున్నారు.

పంట రంగు మారుతుంది..



వాతావరణం మేఘావృతం కావడంతో ఆందోళన చెందుతున్నాం. వర్షాలు కురిస్తే ఇప్పటికే దిగుబడి తక్కువగా ఉన్న పత్తి పంట రంగు మారుతుంది. ప్రతిరోజు ఉదయం మంచు కురుస్తుండడంతో జొన్న, వేరుశనగ పంటలకు ఇబ్బందులు తప్పవు.

- గోపాల్, రైతు, మెట్టపిప్రి

ఆందోళన అవసరం లేదు



ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జొన్న కంకి కిందికి వచ్చి ఉంటే, పైకి కట్టాలి. ఏ పంటకు కూడా నష్టం ఉండదు. సలహాలు, సూచనలు కావాలంటే ఏఈవోలను సంప్రదించాలి.

- ఎన్. గోపీకాంత్, ఏవో

శివాలయంలో ప్రత్యేక పూజలు


విద్యుత్ దీపాల వెలుగుల్లో శివాలయం

కెరమెరి: నేడు అయోధ్యలో శ్రీ రాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు హనుమాన్ చాలీసా పారాయణం, 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకుడు బాపూదేవ్ తెలిపారు. 12:30 గంటల నుంచి అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠ లైవ్ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించనున్నారు. ఇందుకు పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ను కూడా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

భారీ ర్యాలీ

లింగాపూర్: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఉదయం 9 గంటలకు మండల కేంద్రానికి చేరుకోవాలని, ర్యాలీకి ముఖ్య అతిథిగా సినీనటుడు, వ్యాపారవేత్త అభినవ్ సర్దార్ రానున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటికీ శ్రీరాములోరి అక్షింతలు పంపిణీ


జామినిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు


వీధులను అలంకరించిన గ్రామస్తులు

జైనూర్: అయోధ్యలో శ్రీరాములోరి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని జామిని గ్రామస్తులు గ్రామ స్వచ్ఛతతో పాటు సుందరీకరణ చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో కాషాయ జెండాలతో పాటు తోరణాలు కట్టారు. రోడ్లను శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు వేశారు. గ్రామస్తులు సంప్రదాయ వాయిద్యాల నడుమ శ్రీరాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'ప్రతీ ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలి'

కాగజ్‌నగర్‌రూరల్: 500 ఏళ్ల కల నెరవేరిన శుభవేళ సోమవారం పట్టణంలోని ప్రతీ ఇంటిపై కాషాయ జెండాలు ఎగురవేయాలని భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ శివ అన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ ఆలయంలో భజరంగ్ దళ్ సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించాలని, సాయంత్రం ప్రతీ ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలన్నారు. శ్రీరామచంద్ర తీర్థ ట్రస్ట్ సభ్యులు, భజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భజన


శివాలయంలో భజన చేస్తున్న భక్తులు

దహెగాం: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో గత రెండు రోజుల నుంచి రామ నామ సంకీర్తన భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సోమవారం శివాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వేదపండితుడు పరమేశ్వర్ తెలిపారు. అనంతరం శోభాయాత్ర ఉంటుందన్నారు.

ఆలయంలో శ్రమదానం


ఆలయాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం గోలేటిటౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో విద్యాభారతి విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక బీజేపీ నాయకులు శ్రమదానం చేసి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి ఆలయ పరిసరాలను నీటితో శుభ్రం చేశారు. ఆలయం ముందు ఉన్న మెట్లకు విద్యార్థులు కుంకుమ, పసుపు బొట్లు అద్దారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఆలయంలో శ్రమదానం నిర్వహించినట్లు విద్యాభారతి విద్యాసంస్థల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి గోడపై జైశ్రీరామ్ ముద్ర



గోడలపై ముద్ర వేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ గ్రామానికి చెందిన శ్రీరామ భక్తుడు సప్తె శ్రీనివాస్ తన గ్రామంలోని ఇళ్ల గోడలపై జై శ్రీరామ్ నామ ముద్ర వేశారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తన గ్రామంలో ప్రతీ ఇంటి గోడపై శ్రీరామ నామం ఉండాలనే ఉద్దేశంతో గోడలపై ముద్ర వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


బహుమతులు ప్రదానం చేస్తున్న హరీశ్‌బాబు


బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సిర్పూర్(టి) ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని మురళీగూడ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సర్పంచ్ ఈశ్వరీబాయి, బీజేపీ మండల అధ్యక్షుడు జునగరి మధుకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

దహెగాం: క్రీడల్లో గెలుపోటములు సహజమని సహకార సంఘం చైర్మన్ కొండ్ర తిరుపతి గౌడ్ అన్నారు. మండలంలోని పీకలగుండం గ్రామంలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్‌లో మల్లంపేట, పీకలగుండం జట్లు తలపడగా మల్లంపేట జట్టు విజేతగా నిలిచింది. మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేల నగదుతో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్‌చైర్మన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, చంద్రపల్లి సర్పంచ్ లగ్గామ దామోదర్, నాయకులు ఎల్కరి దామోదర్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని ఈదులవాడ గ్రామంలో భీమన్న ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

లింగాపూర్: మండల కేంద్రంలో శ్రీజగదాంబదేవి జాతర సందర్భంగా ఆదివారం వాలీబాల్ పోటీలను గ్రామ నాయక్ కిరణ్ రాథోడ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. జాదవ్ రమేశ్, బానోత్ కిషన్, రాథోడ్ గోకుల్, అర్క సుదర్శన్ తదితరులు ఉన్నారు.

నిర్మాణం సరే.. ప్రారంభమెప్పుడో?



కొత్తగా నిర్మించిన ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం


పగుళ్లు తేలిన గోడలు

కెరమెరి: మండలంలోని పిట్టగూడ గ్రామంలో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం పూర్తయ్యి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం లేకున్నా అధికారులు రూ.5 లక్షల నిధులతో మోడల్ అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని నిర్మించారు. కాగా భవనం ప్రారంభం కాక ముందే లోపలి గోడలకు పగుళ్లు తేలాయి.

పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన

మందమర్రిరూరల్: ఏళ్లుగా స్థానిక మార్కెట్ బస్టాండ్ ఏరియాలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఈ నెల 10న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పబ్లిక్ పరేషాన్' అనే కథనానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించారు. మందమర్రి మార్కెట్ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం రూ.18లక్షలతో నిర్మించే పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన చేయడంతో పట్టణ ప్రజలు 'సాక్షి' దినపత్రికకు అభినందనలు తెలిపారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి


ఓటు నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్‌ఐ

కౌటాల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఐ దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: మండలంలోని దుబ్బగూడంలో నెన్నెల పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలపై ఆదివారం యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. చాలా మంది యువకులు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. అపరిచితుల నుంచి వచ్చిన మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసులు సత్యం, అనంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో ప్రత్యేక ఓటరు నమోదు

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. బెజ్జాల, నర్సాపూర్ గ్రామపంచాతీల పరిధిలోని వాసాల మాడ, బీర్సాయి గూడ, గిరిజన గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. 18ఏళ్ల వయో పరిమితి నిండిన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూర్ మండల డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.